క్లుప్తంగా

ఎమ్మెల్యే చంటిబాబును కలిసిన ఎంపీడీఓ



ఎమ్మెల్యే చంటిబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

జగ్గంపేట: కిర్లంపూడి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.రాజేశ్వరరావు శుక్రవారం ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందజేయడంతో పాటు మండల అభివృద్ధికి కృషిచేయాలని ఎంపీడీఓకు ఎమ్మెల్యే చంటిబాబు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు భూపాలపట్నం ప్రసాద్, ఎస్ఆర్‌పాలెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మంచి ఫలితాలు

కోటనందూరు: భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బిళ్లనందూరు రైతుభరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాల ఆధారంగా సాగుభూమి వాస్తవ పరిస్థితి తెలుస్తుందన్నారు. భూమి సారాన్ని బట్టి ఎరువులు, పురుగు మందులు వాడుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఆర్బీకేల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సకాలంలో వరి సాగుకు సన్నద్ధం కావాలని రైతులకు సూచించారు. వీఏఏ భవాని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి దొడ్డా విజయ్



గోకవరం: టీడీపీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు దొడ్డా విజయ్ వైఎస్సార్ సీపీలోకి చేరనున్నట్టు ప్రకటించారు. ఇటీవల టీడీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన ఆయన తాజాగా ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. గోకవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల తాను స్వచ్ఛందంగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును కలిసి తన నిర్ణయం వెల్లడించగా ఆయన స్వాగతించారన్నారు. ఎటువంటి పదవులను ఆశిస్తూ తాను వైఎస్సార్ సీపీలోకి చేరడం లేదని స్పష్టం చేశారు. తనను పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యేకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కిర్లంపూడి: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాద్‌రావు సూచించారు. జగపతినగరం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. సచివాలయాల్లో తక్కువ ఖర్చుతోనే అందుతున్న డిజిటల్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చిల్లంగిలో రూ.15 లక్షలతో నిర్మించిన పురగిరి క్షత్రియ మల్టిపుల్ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, ఏఈ నారాయణరావు తదితరులు ఉన్నారు.

ఇందుగపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



ఇందుగపల్లిలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఇందిరాప్రియదర్శిని

కోటనందూరు: మండలంలోని ఇందుగపల్లిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉష్ణతాపం, వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి చిన్నారులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

ఈదురు గాలులతో అరటి పంటకు నష్టం

శంఖవరం: ఇటీవల వీచిన ఈదురు గాలులకు అరటి పంటలకు భారీ నష్టం వాటిల్లినట్టు ఉద్యానశాఖాధికారి అరుణ్ కుమార్ తెలిపారు. మండలంలోని మండపం, రౌతులపూడి మండలంలోని పారుపాక గ్రామాల్లో దెబ్బతిన్న అరటి పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈదురు గాలులకు 43 ఎకరాల్లో అరటి తోటలకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

గ్రామ సేవాలయాలు

- దేశానికే ఆదర్శంగా నిలిచిన సచివాలయ వ్యవస్థ
- ఇంటి వద్దకే అన్నిరకాల సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఒమ్మంగి గ్రామ సచివాలయం

ప్రత్తిపాడు రూరల్: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 12 శాఖల అధికారులను నియమించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఇక ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి గ్రామాల్లోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. దీంతో సచివాలయాలకు దేశంలోనే మంచి పేరు ప్రతిష్టలు వచ్చాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందుతున్నాయి.

ప్రత్తిపాడు మండలంలో సచివాలయాలు, లబ్ధిదారుల వివరాలు

సచివాలయాల సంఖ్య	: 26
నాలుగేళ్లలో అన్ని రకాల పథకాల లబ్ధిదారుల సంఖ్య	: 25789
ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులు పొందిన లబ్ధి	: రూ.197 కోట్లు
వైఎస్సార్ ఆసరా తీసుకున్న లబ్ధిదారుల సంఖ్య	: 13,591
వైఎస్సార్ ఆసరా ద్వారా పొందిన లబ్ధి	: రూ.31.64 కోట్లు
మండలంలో వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య	: 11,686
పెన్షన్‌దారులు పొందిన లబ్ధి	: రూ.3,23,03,000

ప్రజల వద్దకే పాలన

సచివాలయాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన నినాదం నిజమైంది. గత పాలకులు ఎప్పుడో ఒకసారి చుట్టపు చూపుగా వచ్చి ఇంటి వద్దకే పాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకునే వారు. కానీ జగనన్న ప్రభుత్వం పక్కాగా ఇంటి వద్దకే పాలన అందిస్తోంది. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు ప్రజలు జేజేలు కొడుతున్నారు.

జగనన్న నిర్ణయం సాహసోపేతం

రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలు ఏర్పాటు చేయాలంటే వేల కోట్లు అవసరం. అయినప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం నిర్మించారు. అందులో ఉద్యోగులను నియమించి, ఫర్నీచర్‌ను ఏర్పాటు చేయడం తలకు మించిన భారం. అయినా లెక్క చేయని జగనన్న వాటన్నింటినీ చకచకా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. దీంతో జగనన్న తీసుకున్న నిర్ణయం సాహసోపేతం అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేయడంతో పాటు తమకు అందుతున్న సేవల పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

స్వగ్రామంలోనే సేవలు

గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వానికి సంబంధించిన వందల రకాల సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా నవతర్నాలకు సంబంధించిన పింఛన్ పంపిణీ, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇల్లు, భూములు రీ సర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. గతంలో రేషన్ కార్డు, ఇంటి స్థలాలు లాంటి ఏ పథకం కావాలన్నా మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగేవాళ్లమని, ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మా గ్రా మంలోనే అన్ని సేవలు పొందుతున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో నష్టాలు.. ఇప్పుడు లాభాలు



నా పేరు సారిపల్లి ధర్మరాజు. మాది పెద్దిపాలెం గ్రామం, ప్రత్తిపాడు మండలం. నాకు స్వగ్రామంలోనే నాలుగు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తే ఏటా నష్టమే వచ్చేది. దాదాపు రూ.లక్ష ఖర్చు చేసి సాగు చేస్తే పంట చేతికొచ్చేది ఎప్పుడో. దీనికి తోడు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఏదీ కొనాలన్నా ప్రత్తిపాడుకు వెళ్లాలి. రాను పోను ఖర్చులే రూ.200 అయ్యేవి. వ్యవసాయం చేస్తే అప్పులు తప్పా ఆదాయం లేదని, ఏదైనా పని చేసుకుందామని చాలా సార్లు అనుకున్నా. అయితే అదృష్టం కొద్ది జగనన్న సీఎం అయ్యాక విత్తనాలు, ఎరువులు, మందులు అన్ని మా గ్రామం లోనే ఇస్తున్నారు. వ్యవసాయానికి అన్ని విధాలా ప్రభుత్వం సాయం చేయడంతో వ్యవసాయం బాగా చేసుకుంటున్నా. ఖర్చులు పోను ఎంతో కొంత డబ్బు మిగులుతోంది. గతంలో కంటే ఇప్పుడు వ్యవసాయం బాగుంది.

మా కుటుంబంలో వెలుగులు నింపారు



నా పేరు ముర్ల లక్ష్మి. మాది బాపన్నదార గిరిజన గ్రామం, ప్రత్తిపాడు మండలం. ఒంటరిగా జీవిస్తున్న నాకు ఒక కుమారుడు ఉన్నాడు. అయితే జగనన్న వచ్చిన తర్వాత వితంతు పింఛన్ పెంచి ఇవ్వడంతో కొంత మేరకు ఉపశమనం కలిగింది. తర్వాత వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా ద్వారా రూ.18,750 వస్తోంది. నా కుమారుడు కాశీ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. దీంతో ప్రతి నెలా రూ.5 వేలు గౌరవ వేతనం అందుతుంది. ప్రస్తుతం మేము సంతోషంగా జీవిస్తున్నాం.

గతంలో పథకాలు అందలేదు



నా పేరు కించు చిన్నబుల్లి, బవురువాక గిరిజన గ్రామం, ప్రత్తిపాడు మండలం. భర్త 15 ఏళ్ల కిందట మరణించాడు. కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటూ కుమార్తెకు వివాహం జరిపించాను. ఈ తరుణంలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందాలనుకుంటే టీడీపీ హయాంలో ఒక్క రూపాయి కూడా వచ్చిన దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే ముందుగా పింఛన్ పెంపుదలతో కొంత మేరకు ఉపశమనం కలిగింది. తర్వాత వైఎస్సార్ ఆసరా మూడేళ్లుగా రూ.25 వేలు వచ్చింది. అలాగే వైఎస్సార్ చేయూత రూ.18750 చొప్పున రెండేళ్లుగా వస్తోంది. దీంతో తమ జీవనం ఇబ్బంది లేకుండా గడిచిపోతోంది.

జగన్ పాలనలో సుభిక్షంగా ప్రజలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ధర్మవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



ధర్మవరంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, సొసైటీ చైర్మన్ చెక్కపల్లి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి, జువ్వల బాబులు, నానిపల్లి చంటి తదితరులతో కలిసి సచివాలయం-2 పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, గ్రామ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాస్, పార్టీ నాయకులు జువ్వల చినబాబు, బొల్లు తాతాజీ, కుప్పిన శ్రీను, కృపావరం, రాపా గుర్రాజు, మాగాపు శివ, గోపి తదితరు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు



వి.కొత్తూరులో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు అందజేశారు. పాఠశాలకు చెందిన పడాల మహేంద్ర, బర్రే సూర్యచక్రప్రవీణ్, కోడినాగుల వీరవెంకట అప్పారావు మొదటి మూడు స్థానాల్లో నిలవగా ప్రభుత్వం నుంచి రూ.10 వేలు నగదు పురస్కారం లభించింది. వీరిలో పడాల మహేంద్ర 581 మార్కులతో మండల ప్రథమ స్థానంతో పాటు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.50 వేలు నగదు పురస్కారం అందుకున్నాడు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రవి, పాఠశాల పీఎంసీ చైర్మన్ గన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సైతం మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారం అందించి సత్కరించారు.

శంఖవరం మండలంలో..

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి, కత్తిపూడి జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఈగల విజయదుర్గ, కొల్లు సత్తిబాబు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. .

జగనన్న ఆణిముత్యాలకు సత్కారం

తుని రూరల్: విద్యా రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ అన్నారు. వి.కొత్తూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు, జగనన్న విద్యా కానుకల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎ.మధుశ్రీ, బి.యశోధ, వి.అమృత వర్షిణి, ఎస్‌కే శ్రీనివాస్, ఎం.ప్రమీల సీహెచ్.శరణ్యలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. 578 మార్కులు సాధించిన ఎ.మధుశ్రీకి పోతల రమణ అదనంగా మరో రూ.5116 అందజేసి సత్కరించారు. ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి, హెచ్‌ఎం వి.అప్పారావు, సర్పంచ్ దుంగల రోజామణి, ఎంపీటీసీ సభ్యుడు కిల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

తొండంగి: సర్కారీ స్కూళ్లలో విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి అన్నారు. ఏవీ నగరం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ అంబుజాలపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన హోం మంత్రి వనిత



హోం మంత్రి వనితకు నూతన పట్టు వస్త్రాలు బహూకరిస్తున్న దేవస్థానం చైర్మన్ రోహిత్

అన్నవరం: రాష్ట్ర హోం శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆధ్వర్యంలో పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా నూతన పట్టువస్త్రాలను దేవస్థానం చైర్మన్ రోహిత్, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఈఓ చంద్రశేఖర్ అజాద్ అందజేశారు. మంత్రి వెంట డీఎస్పీ లతా కుమారి, ప్రత్తిపాడు సీఐ కిషోర్ బాబు, దేవస్థానం అధికారులు ఉన్నారు.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న బీఎస్ రామయ్య విద్యాసంస్థల అధినేతలతో ఎమ్మెల్యే దొరబాబు

సత్యదేవుని దర్శించిన బీఎస్ రామయ్య విద్యాసంస్థల అధినేతలు

అన్నవరం: బెంగళూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, బీఎస్ రామయ్య విద్యాసంస్థల అధినేతలు బీఎస్ సీతారామ్, జయరామ్, జానకీరామ్ శుక్రవారం తమ కుటుంబ సభ్యులతో కలిసి రత్నగిరిపై సత్యదేవుని వ్రతాలాచరించారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత రత్నగిరిపై పండితులు వారికి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు దేవస్థానంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమాజ సేవకు ప్రాధాన్యం

తుని: ప్రతిఒక్కరూ సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రముఖ సైకాలజిస్ట్ పాలంకి సుజాత అన్నారు. స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని రోటరీ భవనంలో శుక్రవారం సాయంత్రం విన్నర్‌వీల్, రోటరీక్లబ్, రోటరాక్టు క్లబ్ ఆత్మీయ సమావేశం క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు నేరేళ్ల సాయిబాబా అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సుజాత ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పలు అంశాలను వివరించారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు శివకోటి మధుసూదనరావు సేవ-పరమార్థం అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆధ్యాత్మికవేత్త శర్మ, ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. రోటరీక్లబ్ కార్యదర్శి మలిపెద్ది సురేష్, కోశాధికారి కోరుకొండ గణేష్‌తో పాటు తుని, పాయకరావుపేట, అన్నవరం రోటరీక్లబ్‌లకు చెందిన 150 మంది సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలో అభయ దుర్గమ్మ, కిర్లంపూడి శివారు వనదుర్గమ్మ ఆలయాల వద్ద శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువఝల అవధాని, ముష్టి పురుషోత్తం, చిట్టెం వాసు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 14 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, ఉప ప్రధానార్చకుడు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు

గండేపల్లి: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల్లో సిద్ధం చేసినట్టు మండల వ్యవసాయాధికారి పి.సద్గురుమూర్తి శుక్రవారం తెలిపారు. మండలంలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న మల్లేపల్లి, బొర్రంపాలెం, తాళ్లూరు, గండేపల్లి, జెడ్.రాగంపేట, తదితర గ్రామాల్లో రైతులు ఇప్పటికే వేసవి దుక్కులు పూర్తి చేసి ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారన్నారు. రెవెన్యూ, వ్యవసాయశాఖల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు సాగు హక్కు పత్రాలపై అవగాహన కల్పించామన్నారు. ఇప్పటి వరకు 610 సాగు హక్కు పత్రాలు జారీచేసినట్టు తెలిపారు. అర్హత గల ప్రతి కౌలు రైతుకు సాగు హక్కు పత్రాలు అందేలా చూస్తామన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



కోటనందూరులో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న దొరబాబు

కోటనందూరు: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు గర్సింగు దొరబాబు అన్నారు. స్థానిక ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం ఆయన జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు మళ్ల సూర్యచంద్ర, గర్సింగు శ్రీను పాల్గొన్నారు.

సెగ.. భగభగ

- నిప్పులు కురిపిస్తున్న భానుడు
- ఎండలకు తల్లడిల్లుతున్న ప్రజలు
- కర్ఫ్యూను తలపిస్తున్న ప్రధానరహదారులు



నిర్మానుష్యంగా మారిన తుని మెయిన్ రోడ్డు



ఏలేశ్వరంలో టోపీ, ముసుగులతో మోటారు సైకిళ్లపై వెళుతున్న జంటలు



గండేపల్లిలో నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

తుని/ఏలేశ్వరం/ప్రత్తిపాడు రూరల్/గండేపల్లి: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శుక్రవారం 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం 6 గంటల వరకూ వడగాడ్పులు వీచాయి. ప్రజలు ఎండకు భయపడి ఇళ్లకే పరిమితం అయ్యారు. వడగాడ్పులకు చిన్నా, పెద్దా తేడా లేకుండా విలవిల్లాడారు. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ, కొబ్బరి నీళ్లు, బార్లి, చెరకు రసం, పండ్ల రసాల కోసం పరుగులు తీశారు. ఎండలకు నిత్యం రద్దీగా ఉండే తుని మెయిన్‌రోడ్డు, ఏలేశ్వరంలోని హనుమాన్ జంక్షన్, లింగంపర్తి రోడ్డు, యర్రవరం రోడ్డు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 10 గంటల తరువాత జాతీయ రహదారిపై సైతం వాహనాల రాకపోకలు తగ్గాయి. లారీ డ్రైవర్లు తమ వాహనాలను చెట్ల కింద నిలిపివేసి సేదదీరారు. మూగజీవాలు ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మరో రెండు రోజుల పాటు వాతావరణం ఇలానే ఉంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని వినతి

తొండంగి: జి.ముసలయ్యపేటలో ఇటీవల జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తొండంగి పోలీస్ స్టేషన్‌లో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారికి వినతిపత్రం అందించారు.

ఈ-స్టాంప్స్ ప్రారంభం

ప్రత్తిపాడు: దస్తావేజు స్టాంపు పేపర్లకు బదులుగా ప్రభుత్వం నూతనంగా ఈ-స్టాంప్ పేపర్లను ప్రవేశపెట్టిందని ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఈ-స్టాంపు కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా ఇకపై కక్షిదారులకు ఆన్‌లైన్ నాన్ జ్యుడీషియల్ ఈ-స్టాంపులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

దేశానికే ఆదర్శం మోదీ పాలన



బెండపూడి సభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

తొండంగి: దేశం గర్వించదగిన విధంగా ఆదర్శవంతమైన పాలనను ప్రధాని మోదీ అందిస్తున్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ అన్నారు. శుక్రవారం బెండపూడిలో జరిగిన బీజేపీ సభలో ఆయన మాట్లాడారు. అవినీతి రహిత పాలన అందించడంతో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మోదీ పాలన అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.